ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాజధాని అమరావతిలో రెండవ విడత భూసేకరణలో భాగంగా మరో 44వేల ఎకరాలను సేకరించాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది.
- రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యటకాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు.
- విశాఖ రైల్వే జోన్ కి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ త్వరలోనే వెలువడుతుందని స్థానిక పార్లమెంటు సభ్యులు ఎం. శ్రీభరత్ తెలిపారు.
- విపత్తుల సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చూడాల్సిన అవసరం ఉందని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్త సలహాదారుడు నావెల్ ప్రకాష్ తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29న ప్రసారమవుతుంది.

===================

రాష్ట్రంలో భూసేకరణకు సంబంధించి సమగ్రమైన విధానం అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగిన మంత్రి వర్గ సమావేశంలో పలు అంశాలపై చర్చించిన తర్వాత ఆమోదం తెలిపారు. రాజధాని అమరావతిలో రెండవ విడత భూసేకరణలో భాగంగా మరో 44వేల ఎకరాలను సేకరించాలని మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. ఆ వివరాలను రాష్ట్ర సమాచార మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వివరించారు. స్వర్ణాంధ్ర P4పై త్వరలో కమిటీలు ఏర్పాటు చేయడానికి కేబినేట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్ మిట్టల్ స్టీల్ సంస్థకు సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేసే విధంగా చూడాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారని మంత్రి పార్థసారధి తెలియజేస్తూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===================

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని ఈరోజు జరిగిన మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయించారు. అన్న క్యాంటీన్ల పనితీరును పర్యవేక్షించేందుకు విరాళాలు తీసుకోవడానికి ఒక కమిటీని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. మంత్రివర్గ సమావేశంలో ఈరోజు ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ధరల స్థిరీకరణ నిధి ద్వారా పొగాకు, మామిడి, కోకో పంటల రైతులను ఆదుకుంటున్నామని తెలిపారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. గిరాకీకి తగిన విధంగా వాణిజ్య పంటలు వేసేలా రైతులను చైతన్య పరచాలన్నారు. అదే విధంగా రాష్ట్రంలో 6వేల 497 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను, అంగన్‌వాడీ కేంద్రాలుగా ఉన్నతీకరిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. టెంపుల్ టూరిజంతో పాటు రాష్ట్రంలోని పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆయన సూచించారు.

===================

విశాఖ రైల్వే జోన్ కి సంబంధించి త్వరలోనే గెజిట్ నోటిఫికేషన్ వెలువడుతుందని స్థానిక పార్లమెంటు సభ్యులు ఎం శ్రీభరత్ తెలిపారు. ఈరోజు ఆయన ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో మాట్లాడుతూ.. విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టు తో పాటు పై వంతెనల నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వీటి నిర్మాణ పనులు మొదలవుతాయని చెప్పారు. విశాఖలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని శ్రీభరత్ తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...26 సెకన్లు)

===================

విపత్తుల సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చూడాల్సిన అవసరం ఉందని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్త సలహాదారుడు నావెల్ ప్రకాష్ తెలిపారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను జిల్లా స్థాయిలో అమలు చేస్తున్న తీరును పరిశీలించేందుకు జిల్లాల్లో పర్యటిస్తున్నామని చెప్పారు. న్యూఢిల్లీ నుండి వచ్చిన ముగ్గురు సభ్యుల జాతీయ విపత్తుల నిర్వహణ బృందం రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈరోజు సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా నావెల్ ప్రకాష్ మాట్లాడుతూ.. విపత్తుల నిర్వహణ విషయంలో ప్రజలను స్వచ్ఛందంగా భాగస్వామ్యం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కింద విపత్తుల సమాచారం కోసం "SACHET" యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

===================

విరామం

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

===================

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 17 వేల 994 కోట్ల రూపాయలతో జిల్లా వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 3వేల 706 కోట్ల రూపాయలు అదనంగా ప్రతిపాదించామని చెప్పారు. అమలాపురం కలెక్టరేట్ లో జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీ ఎల్ ఆర్ సి) సమావేశాలు ఈ రోజు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధికి బ్యాంకర్లు రుణాలు అందించాలని కోరారు. అలాగే స్వయం సహాయక సంఘాల డిపాజిట్ నిధులు వారి ఆర్థిక అవసరాలకు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని సూచించారు.

===================

వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రస్తుతం అమలు చేస్తున్న నిబంధనలను సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం వార్డు సచివాలయ ఉద్యోగులు ఇకపై తమ సొంత మండలానికి బదిలీపై వెళ్లవచ్చునని పేర్కొంది. అదే విధంగా ప్రస్తుతం పనిచేస్తున్న పట్టణంలోని ఇతర వార్డులకు లేదా ఉమ్మడి జిల్లా పరిధిలోని ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు బదిలీ అయ్యేందుకు కూడా అవకాశం కల్పించింది. ఇదిలా ఉండగా, గ్రామ సచివాలయ ఉద్యోగులకు కూడా సొంత మండలాలలో పనిచేసే అవకాశం కల్పించాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరింది.

===================

పశ్చిమగోదావరి జిల్లాలో సార్వా సాగుకు అన్నీ సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్ వెంకటేశ్వరరావు చెప్పారు. భీమవరంలో ఈరోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 2 లక్షల 45 వేల ఎకరాల్లో సార్వా సాగు అవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం ప్రాంతంలో వరి నాట్లు ప్రారంభమయ్యాయని వ్యవసాయ శాఖాధికారి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...33 సెకన్లు)

===================

గ్రామాలలోని రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం కిసాన్ డ్రోన్ యోజన సత్ఫలితాలను ఇస్తోంది. డ్రోన్ వ్యవసాయ పరికరంతో అనేక రకాల బహుళ ప్రయోజనాలు పొందుతున్నామని తిరుపతి జిల్లా తొట్టంబేడు గ్రామానికి చెందిన రైతులు చెబుతున్నారు. కిసాన్ డ్రోన్ యోజన ద్వారా ఒక బృందంగా ఏర్పడ్డామని వారు తెలిపారు. దీంతో 80శాతం రాయితీతో డ్రోన్ పరికరాన్ని బృందాలకు అందచేస్తున్నారని చెప్పారు. డ్రోన్ అసరాతో వ్యవసాయ రంగంలో బహుళ ప్రయోజనాలు పొందుతున్నామని రైతులు  ఆనందం వ్యక్తం చేశారు.

===================

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వాయువ్య బంగాళాఖాతం మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరం మీదుగా ఉపరితల అవర్తనం ఆవరించి ఉందని వాతావరణ శాఖ అధికారి తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...28 సెకన్లు)

===================

===================